సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 5 । నవంబర్ । 2024



మేమంతా ఒక్కటే

కుడి ఎడమల్లో రెండు రాష్ట్రాలతో రట్టిణి విరాజిల్లుతోంది. ఇక్కడ సంప్రదాయాలన్నీ ప్రత్యేకంగా కనిపిస్తాయి. - 8లో



పేదోళ్ల గుడిసెలపై పంజా

అరకభద్రలో షాడో సర్పంచ్ అరాచకం సృష్టిస్తున్నాడు. రోడ్డు పేరుతో గుడిసెలు కూలదోస్తున్నాడు. - 8లో

టెట్ ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ టెట్-2024 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి మొత్తం 16185 మంది టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 14450 మంది ఆన్‌లైన్‌లో జరిగిన పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 65 శాతం మేర క్వాలిఫై సాధించినట్టు సమాచారం.

న్యూస్‌రీల్

ఖాతాదారుల్లో ఆందోళన

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పోస్టుమాస్టర్ క్రాంతి కుమారి అనే మహిళ గత నెల 25న ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమెది ఆమదాలవలస కాగా.. శ్రీకాకుళంలో నివాసం ఉండేవారు. ధర్మవరం పంచాయతీ పరిధిలో చాలా మంది మంది ప్రజలు పోస్టాఫీసులో సేవింగ్ అకౌంట్స్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పోస్టాఫీసులో తమ అకౌంట్‌లో ఉన్న సేవింగ్స్ బొంతలకోడూరులోని పోస్టాఫీసులో పరిశీలించారు. తాము సేవింగ్స్ చేసిన మొత్తం డబ్బులు ఆన్‌లైన్ కాకపోవటం, అకౌంట్‌లో చేరకపోవడాన్ని గుర్తించారు. దీంతో చాలా మంది ఖాతాదారులు పోస్టాఫీసు వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం ఇంకా కొత్త పోస్టుమాస్టర్‌ను వేయలేదు. వీరి డబ్బులు చెల్లించనట్టు ఎలాంటి రశీదులు కూడా లేవు. రూ.లక్షల్లో ఖాతాల్లో జమ జరగలేదని ఖాతాదారులు అంటున్నారు. వీరంతా పేద, మధ్య తరగతికి చెందిన వారే. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే లైసెన్స్ రద్దు

శ్రీకాకుళం రూరల్: హైవేపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా ఉపరవాణా శాఖాధికారి విజయసారథి అన్నారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. భారీ శబ్దాలతో వాహనాలు నడిపినా, బీమా లేకపోయినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రమాదాలు తగ్గించే దిశగా తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు రోడ్‌సేఫ్టీ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా ఏమైనా కేసులు నమోదు చేసి తమ శాఖకు ఎండార్స్ చేస్తే 3 నెలల్లో వారి లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. రవాణా శాఖ ద్వారా జూలై 2023 నుంచి 2024 వరకూ లైసెన్సుల కార్డులకు సంబంధించి ఫీజు వసూలు చేసిన వారందరికీ లైసెన్సు కార్డుల పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. 15 ఏళ్లు పూర్తయిన పాత వాహనాల రెన్యువల్‌కు గ్రీన్‌టాక్స్ కార్లు, లారీలకు గాను రూ.5వేలు కాగా ద్విచక్ర వాహనాలను రూ.2వేలు కట్టాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ కార్డులకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

గ్రామం మధ్యలో వైన్‌షాప్ వద్దు

టెక్కలి: ప్రశాంతమైన వాతావరణం కలిగిన నౌపడ గ్రామంలో జనావాసాల మధ్య వైన్‌షాప్ పెట్టవద్దని, గ్రామస్తులకు వ్యతిరేకంగా వైన్‌షాప్ పెడితే తీవ్రమైన కొట్లాటలు జరుగుతాయని సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామస్తులు టెక్కలి ఆర్డీఓ కార్యాలయం అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. జనావాసాలు, గౌరమ్మతల్లి శక్తిపీఠం, వేంకటేశ్వర ఆలయం సమీపంలో వైన్‌షాప్ ఏర్పాటు చేసేందుకు పాటదారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని వెల్లడించారు. వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలుగుతుందని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని, ముఖ్యంగా మహిళలపై దాడులు జరిగే అవకాశం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామం మధ్యలో వైన్‌షాప్ పెట్టకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు అందుకుంటున్న స్వామి



టెక్కలి: రావివలస ఎండల మల్లన్నకు పూజలు చేస్తున్న భక్తులు



శ్రీకాకుళం కాశీ విశ్వేశ్వరాలయంలో ఆకాశదీపాల బుట్టలు

● ఓం శివోహం

తొలి కార్తీక సోమవారం నాడు జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడిని పంచామృతాలతో అభిషేకించి అర్చించారు. వేకువజాము నుంచే ఆలయాల ముందు బారులు తీరిన భక్తులు ఆకాశదీపాలు వెలిగించి మొక్కులు కట్టారు.





శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో అభిషేక సేవ

● ఎస్‌బీఐలో

మరో దారుణం

- ప్రభుత్వ ఉద్యోగులకు తెలియకుండా, వారి పేర్లతో వ్యక్తిగత రుణాలు తీసుకున్నట్టు ఆరోపణలు
- అంతర్గత ఆడిట్‌లోనూ, విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన అక్రమాలు
- అప్పటి నరసన్నపేట బ్రాంచి మేనేజర్‌గా పనిచేసిన శ్రీకర్ సస్పెన్షన్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మరో దా'రుణం' వెలుగుచూసింది. గత ఏడాది గార స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో జరిగిన తాకట్టు ఆభరణాల మిస్సింగ్ అప్పట్లో పెద్ద సంచలనమైంది. దాని తర్వాత నరసన్నపేట బజారు బ్రాంచిలో సుమారు రూ.3కోట్ల మేర ప్రభుత్వ ఉద్యోగుల పేరిట రుణాలు తీసుకుని కొందరు సిబ్బంది సొంతానికి వాడుకున్న వ్యవహారం వెలుగు చూసింది. దీనిపై అప్పట్లో 'సాక్షి' దినపత్రికలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఇప్పుడు ఆ కథనాలు అక్షర సత్యాలయ్యాయి. 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాక అంతర్గత విచారణతో పాటు విజిలెన్స్ విచారణ చేపట్టడంతో అక్కడ అక్రమాలు జరిగాయని తేలింది. దీనిలో భాగంగా అప్పట్లో బ్రాంచి మేనేజర్‌గా పనిచేసిన శ్రీకర్‌ను శనివారం ఎస్‌బీఐ యాజమాన్యం సస్పెండ్ చేసింది.

- తాజాగా నరసన్నపేట ఎస్‌బీఐలో ప్రభుత్వ ఉద్యోగుల పేరిట బ్యాంకు సిబ్బందే వ్యక్తిగత రుణాలు తీసుకుని, దాదాపు రూ.3కోట్ల వరకు తమ జేబుల్లో వేసుకున్నట్టు బయటకు వచ్చింది.
- సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు వివిధ అవసరాల కోసం వ్యక్తిగత రుణాలు కావాలని బ్యాంకుల్ని ఆశ్రయిస్తారు. ఇవ్వాలా? ఇవ్వకూడదా? అన్నది బ్యాంకులే తుది నిర్ణయం తీసుకుంటాయి.
- దరఖాస్తు చేసినప్పటికీ ఎవరికైతే రుణాలు ఇవ్వలేదో ఆ ప్రభుత్వ ఉద్యోగుల డాక్యుమెంట్లను అదే బ్యాంకులో పెట్టి.. ఆ ఉద్యోగుల పేరుతో బ్యాంకు ఉద్యోగులే వ్యక్తిగత రుణాలు తీసుకున్నట్టుగా సమాచారం.
- ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు మేనేజర్‌తో పాటు రీజినల్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి.
- విషయం బయటకు పొక్కడంతో జరిగిన తప్పిదానికి అక్కడ బ్రాంచి మేనేజర్నే బాధ్యుడిని చేసేందుకు ప్రయత్నించడమే కాకుండా ఆయనతో కొంత మొత్తాన్ని తిరిగి బ్యాంకులో జమ చేయించినట్టుగా వాదనలు ఉన్నాయి.
- ఒకానొక సందర్భంలో మొత్తం వ్యవహారం తన మెడకు చుట్టుకుంటోందని అప్పటి బ్యాంకు మేనేజర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్న వార్తలు వచ్చాయి.



ఎస్‌బీఐలో రుణాల కలకలం!

సాక్షిలో ప్రచురితమైన కథనం



మరో సంచలనం..

గార ఎస్బీఐలో ఖాతాదారుల తాకట్టు బంగారు ఆభరణాలను బయటికి తీసి, వేరొక బ్యాంకులో కుదవ పెట్టి బ్యాంకు ఉద్యోగులే పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని, సొంతానికి ఎంజాయ్ చేసిన వ్యవహారం గత ఏడాది చర్చనీయాంశం కాగా.. ఆ ఘటనకు కొన్ని నెలల్లోనే నరసన్నపేట బజారు బ్రాంచిలో సుమారు రూ. 3 కోట్ల వరకు అవినీతి జరగడం మరో సంచలనమైంది. వందమందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు తెలియకుండా బ్యాంకు అధికారులే వారి పేరిట వ్యక్తిగత రుణాలు తీసుకున్నట్టు విచారణలో తేలినట్టు సమాచారం. బ్యాంకు అంతర్గత ఆడిట్‌లోనే కాకుండా విజిలెన్స్ విచారణలో కూడా ఇక్కడ జరిగిన అక్రమాలు నిర్ధారణ అయినట్టు సమాచారం. రీజనల్ పరిధిలోని బ్రాంచిల్లో వరుసగా అక్రమ బాగోతాలు బయటపడటంతో నాటి శ్రీకాకుళం రీజినల్ మేనేజర్ తోటకూర రమణమూర్తిరాజును యుద్ధ ప్రాతిపదికన ఇక్కడి నుంచి బదిలీ చేసేశారు. అప్పటి నుంచి గార ఎస్బీఐ తో పాటు నరసన్నపేట బ్రాంచిలో జరిగిన అక్రమాలపై లోతుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో అప్పటి నరసన్నపేట బ్రాంచి మేనేజర్ శ్రీకర్‌ను తాజాగా శనివారం సస్పెండ్ చేశారు.

అంబేడ్కర్ రాజ్యాంగం పోయి..

రెడ్‌బుక్ రాజ్యాంగం వచ్చింది

- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కూడా కూటమి ప్రభుత్వం మర్చిపోయిందని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు తమ్మినేని సీతారాం అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం పోయి, రెడ్‌బుక్ రాజ్యాంగం వచ్చిందని మండిపడ్డారు. ఆయన సోమవారం ఆమదాలవలసలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో రాష్ట్రంలో 80 మంది మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరిగాయని, దాడులు చేసిన వారికి స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తనయుడు లోకేష్ బాబులు వెన్నుదన్నుగా ఉండడంతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ మట్టి కరుస్తోందని అన్నారు. నంద్యాలలో 8 ఏళ్ల బాలిక పై అత్యాచారం చేసి హతమార్చారని, హిందూపురంలో యువతిపై అత్యాచారం చేసి పెట్రోలు పోసి తగలబెట్టారని, పలాసలో ఇద్దరు బాలికలపై అత్యాచారం చేశారని గుర్తుచేశారు. ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారికి ప్రతి చోటా టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్లలో రికమెండేషన్ చేయిస్తుండడం బాధాకరమన్నారు. ఎన్నికల హామీల్లో తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అని చెప్పి తీరా ప్రభుత్వం వచ్చాక ఆ పథకానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్రంలో ఒక కోటి 50 లక్షల మంది లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న ప్రభుత్వం, కేవలం కోటి మందికే పరిమితం చేసిందన్నారు. లబ్ధిదారులందరికీ ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే రూ. 1345 కోట్లు అవసరమని, కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 895 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా ప్రభుత్వం కుట్ర అర్థమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న దిశా చట్టాన్ని, కూటమి ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందన్నారు. రాజకీయ కక్షతో ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయటం తగదన్నారు. బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు నాయుడు ప్రజలపై అదనపు కరెంట్ చార్జీలు మోతకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 2014–19 సంవత్సరాల కాలంలో చంద్రబాబు నాయకత్వంలో అప్పటి ప్రభుత్వం చేసిన అప్పులు, బకాయిలు కలసి రూ.86,215 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు చార్జీల పెంపుతో అప్పటి ప్రజానీకం రోడ్లపైకి వచ్చిన విషయాన్ని మరవకూడదన్నారు. బషీర్‌బాగ్ ఉదంతం గుర్తుపెట్టుకోవాలని కోరారు. ఇప్పటికైనా పెంచిన చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోకపోతే ఉద్యమం చేస్తామన్నారు.

ఏమిటీ అరాచక పాలన..?

- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: కూటమి పాలన నియంత పాలనను తలపిస్తోందని, అరాచకం పెచ్చుమీరుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. శని,ఆదివారాల్లో వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడంపై తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక శాంతిభద్రతలు అదుపు తప్పాయని అన్నారు. ఏకపక్షంగా దాడులు జరుగుతున్నా పోలీసులు బాధితులపై కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. పలాస–కాశీబుగ్గలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు జరుగుతున్నా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలకు అన్ని రకాలుగా పార్టీ అండగా ఉంటుందన్నారు.

భూ కబ్జాలపై

ఇసుక మాఫియా కన్ను



అనుభవదారులపై మాస్కులేసుకున్న మహిళలు దాడి చేస్తున్న దృశ్యం

- రాగోలులో విలువైన భూమిని ఆక్రమించేందుకు యత్నం
- ఆమదాలవలస కీలక నేత మేనళ్లుల్ల పన్నాగం
- అడ్డు తగులుతున్న వారిపై రౌడీ మూకలతో దాడులు
- శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో రాగోలు వద్ద దౌర్జన్యం



రాగోలు వద్ద సిమెంట్, ఐరన్ గొడౌన్‌ను అక్రమంగా జేసీబీతో కూల్చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం రూరల్‌లోని రాగోలు వద్ద కబ్జా పర్వం సాగుతోంది. మొన్న నారాయణపురంలో ఇసుక మాఫియా అక్రమాలను అడ్డుకున్న వ్యక్తిపై దాడి చేసినట్టు, అదే వ్యక్తిపై శ్రీకాకుళంలోని బలగ మెట్టపై హత్యాయత్నానికి పాల్పడినట్టు రాగోలు వద్ద కూడా కూటమి నాయకులు దౌర్జన్యం చేస్తున్నారు. ఆమదాలవలస ఇసుక మాఫియా కన్ను భూదందాలపై కూడా పడింది. అక్కడి కీలక నేత మేనళ్లుల్లు సామాన్యులపై విరుచుకుపడుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా రిజిస్ట్రేషన్ ద్వారా అనుభవంలో ఉన్న భూమిపై కన్నేసి, కబ్జా చేసేందుకు అక్కడున్న అనుభవదారుల్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. పాత డాక్యుమెంటులేవో చూపించి సతాయిస్తున్నారు. అనుభవదారులు అభ్యంతరం పెడుతుండటంతో ఆదివారం బరితెగించారు. కొంతమంది మూకల్ని తీసుకొచ్చి దౌర్జన్యంగా అనుభవదారుల్లో ఒకరికి సంబంధించిన సిమెంట్, ఐరన్ షాపును జేసీబీ పెట్టి తొలగించారు. అంతటితో ఆగకుండా బయట ప్రాంతం నుంచి కొంతమంది మహిళలకు మాస్కులు వేయించి, అక్కడున్న మహిళలపై దాడులు చేశారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డులో ఆ మూకల దౌర్జన్యకాండతో భయానక పరిస్థితి ఏర్పడింది.

శ్రీకాకుళం మండలంలోని రాగోలు పెట్రోలు బంకు పక్కన పాత సర్వే నంబర్ 197, ప్రస్తుత సర్వే నంబర్ 233(1)లో దంగేటి గణపతిరావుకు 80సెంట్లు జాగా ఉండేది. కాలక్రమేణా తన ఆస్తిని విక్రయించుకున్నారు. క్రయవిక్రయాల ద్వారా చివరగా బొడ్డేపల్లి పద్మావతి అనే మహిళకు 21సెంట్లు, వడ్డి లోకేశ్వరరావుకు 10సెంట్లు, మామిడిపల్లి శ్రీమన్నారాయణకు 10సెంట్లు, తూముల శ్రీనివాసరావు 10సెంట్లు, పట్నాల వెంకటరమణ 10 సెంట్లు, జి.వెంకటరమణమ్మ 10 సెంట్లు దఖలు పడింది. వీరిలో కొందరు స్థానికంగా లేరు. మరికొందరికి సంబంధించి వారి వారసులు చూసుకుంటున్నారు. అయితే రూ. కోట్లలో ధర ఉండే ఈ భూమిపై ఆమదాలవలస నియోజకవర్గ కీలక నేత మేనళ్లుల్ల కన్ను పడింది. గత ప్రభుత్వంలోనే ఆక్రమించేందుకు ప్రయత్నించగా అప్పట్లో ఆ వ్యక్తులు ప్రతిపక్షంలో ఉండటంతో కుదరలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం రావడంతో ఆ వ్యక్తుల హవా మొదలైంది. వీరిని ఎలాగైనా ఇక్కడి నుంచి వెళ్లగొట్టాలని చూస్తున్నారు. దాని కోసం సర్వ శక్తులన్నీ ప్రదర్శిస్తున్నారు. వేరే సర్వే నంబర్లు డాక్యుమెంట్లు పట్టుకుని వచ్చి ఈ భూమి తమదే అని ఒత్తిడి చేస్తున్నారు. ప్రతిఘటిస్తున్నందుకు దాడులకు తెగబడుతున్నారు.

ఇప్పటికే బొడ్డేపల్లి ప్రభావతికి సంబంధించిన 21సెంట్లు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించగా, వారి వారసులు అడ్డుకున్నారు. అంతే కాకుండా పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. తాజాగా వడ్డి లోకేశ్వరరావు తనకున్న 10సెంట్లలో వీఎల్ఆర్ సిమెంట్, ఐరన్ షాపు పెట్టుకుని నడుపుకుంటూ వస్తున్నారు. ఇప్పుడా యన షాపుపై పడ్డారు. ఎవరూ లేని సమయం చూసుకుని ఆదివారం జేసీబీ పట్టుకుని వచ్చి కొంత భాగాన్ని కూల్చేశారు. విషయం తెలుసుకుని అనుభవదారులు వచ్చారు. కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈలోగా బొడ్డేపల్లి ప్రభావతి వారసులు కూడా అక్కడివచ్చి ఆక్రమణలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆక్రమణదారులు వ్యూహాత్మకంగా కొంతమంది మూకల్ని అక్కడికి తీసుకొచ్చారు. వారిలో మాస్కులు వేసుకుని, ముఖాలు కనిపించని మహిళలు కూడా ఉన్నారు. వీరంతా అనుభవదారులపై దాడి చేశారు. నడిరోడ్డుపైనే వీరంగం సృష్టించారు. బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు వచ్చేసరికి రౌడీ మూకలు అక్కడి నుంచి పరారయ్యాయి.



ఎగురుతాం.. ఎదుగుతాం

శ్రీకాకుళంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఓ బాలిక చేసిన విన్యాసమిది. పోల్‌జంప్‌ను అలవోకగా దాటి అబ్బురపరిచింది. ఎగిరే సామర్థ్యమే కాదు.. ఎదిగే హక్కు తమకు ఉందని నిరూపించింది.

ఎలుగెత్తుతాం.. ఎదురిస్తాం..



అమ్మకు వందనం అంటూ మైకులు వాచిపోయేలా ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నేతలు ఇప్పుడు ఆ పథకంపై మౌనవ్రతం పాటిస్తున్నారు. దీనిపై విద్యార్థినులు గళం విప్పి కదం తొక్కారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జెడ్పీ వద్ద ధర్నా చేశారు. ఎలుగెత్తి.. ఎదిరిస్తామని చాటి చెప్పారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

టీడీపీ దౌర్జన్యాలపై చర్యలు లేవు

- ఎస్పీకి వినతి పత్రం అందించిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు
- టీడీపీ ప్రభుత్వం మత్స్యకారుల హక్కులను కాలరాస్తోందని వ్యాఖ్య



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో టీడీపీ వర్గీయులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలపై చర్యలు లేవని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. పలాసలో ఇటీవల జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు వంటి ఘటనలపై ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డికి వివరించడానికి తన అనుచరులతో కలిసి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఎస్పీని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని, పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యవస్థలపై పూర్తిగా కంట్రోల్ తప్పిందని అన్నారు. ఇటీవల నడిరోడ్డుపై తన అనుచరుడు అల్లు రమణపై కత్తితో దాడి చేయడమే కాక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తే టీడీపీ తాగుబోతుల బృందమంతా పోలీసుల ఎదుటే మూకుమ్మడి దాడికి దిగారన్నారు. ఇదేమని మా నాయకులు స్టేషన్‌కి వెళ్లి అడుగుదామంటే ఇళ్లల్లోనే నిర్బంధం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చాక కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తామనే మాటను వైఎస్ జగన్ స్వయంగా చెప్పాలని కోరారు. జగన్ కోసం ప్రజలు, కార్యకర్తలు సంఘటితంగా నిలవాలన్నారు.

దీనిపై ఎస్పీని కలవడానికి వచ్చానని, కానీ వారి నిస్సహాయత తనకు తెలుస్తోందని అన్నారు. ఈ ఘటనలపై తాము అధికారంలోకి వచ్చాక వారి పని పడతామన్నారు. స్టేషన్‌లకు వైఎస్సార్ సీపీ వాళ్లను మాత్రమే పిలుస్తున్నారని, టీడీపీ వాళ్లను వదిలేస్తున్నారని విమర్శించారు. అధికారంలో లేనప్పుడు మత్స్యకారుల బతుకులపై మాట్లాడిన పవన్ కల్యాణ్.. నేడు తీర ప్రాంతాలను ప్రైవేటు శక్తులకు అమ్మేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ ఇదివరకు పాలించిన 14 ఏళ్ల కాలంలో ఒక్క హార్బర్ అయినా కట్టిందా అని సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో కొత్తపట్నం, నిజాంపట్నం, మచిలీపట్నం, బుడగట్లపాలెం, పూడిమడక, ఉప్పాడ ప్రాంతాల్లో హార్బర్లు ఫస్ట్ ఫేజ్‌లో కంప్లీట్ అయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో మత్స్యకారుల కోసం ఉద్యమ బాట పడతామన్నారు. మాజీ మంత్రి సీదిరి వెంట ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారిలో పార్టీ నాయకులు ఉదయ్‌కుమార్, ఉంగ సాయి, డొక్కరి దానయ్య, ఇటీవల దాడులకు గురైన బాధితులు ఉన్నారు.

సీదిరికి వైఎస్ జగన్ పరామర్శ

కాశీబుగ్గ: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు సోమవారం మధ్యాహ్నం ఫోన్ చేసి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



జెడ్పీ వద్ద ధర్నా చేపడుతున్న ప్రభుత్వ మద్యం షాపుల కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గత ప్రభుత్వంలో మద్యం షాపుల్లో పనిచేసినవారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి, ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు చాపర వెంకటరమణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీ పేరిట మద్యం షాపులను ప్రైవేటీకరణ చేయడం జరిగిందన్నారు. దీంతో సుమారు 15,000 మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బకాయి పడ్డ జీతాలు, బోనస్‌లు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు డోల శంకరరావు, ఏఐటీయూసీ నాయకులు చిక్కాల గోవిందరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీపై కఠిన చర్యలు



తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

సోంపేట: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.బేబి హెచ్చరించారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధి మందస మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బంది సోమవారం నిర్వహించిన దాడుల్లో 960 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు తెలియజేశారు. మద్యం షాపులు నిర్వహిస్తున్న లైసెన్సర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. నిర్ణయించిన ధరలకు విక్రయించాలని, బెల్టు షాపులకు మందు ఇవ్వరాదని, షాపుల్లో లూజుగా మద్యం అమ్మవద్దని సూచించారు. దాడుల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్ స్టేట్‌మీట్



400 మీటర్ల రిలే పరుగుపందెంలో క్రీడాకారుల జోరు



టైటిల్‌ను వైఎస్సార్ కడప మేనేజర్‌కు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు కన్నులపండువలా సాగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్, ఉషూ చాంపియన్‌షిప్–2024 పోటీలు ముగిశాయి. ఉషూలో అత్యద్భుతంగా రాణించిన ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకోవడం విశేషం. ఉషూలో సిక్కోలు క్రీడాకారులు ఏకంగా 10 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో వైఎస్సార్ కడప ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించింది. శ్రీకాకుళం అథ్లెట్స్ ఒక బంగారు, 4 రజత, 3 కాంస్య పతకాలతో మొత్తం 8 పతకాలు సాధించారు. నగరంలోని కోడిరామ్మూర్తి క్రీడామైదానంలో అండర్–17 విభాగంలో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరగగా, సమీపంలోని ఆర్ట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో అండర్–17, 19 విభాగాల్లో బాలబాలికలకు ఉషూ పోటీలు జరిగాయి.

విజేతలకు బహుమతులు అందజేత..

విజేతలకు జిల్లా పీడీ–పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ తదితరులు బహుమతులు అందజేశారు. శ్రీకాకుళం వేదికగా రెండురోజులపాటు జరిగిన పోటీలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి వీరు కృతజ్ఞతలు తెలిపారు. పోటీల తొలిరోజు హడావుడి చేసిన కూటమి ప్రభుత్వ నాయకులు రెండోరోజు మాత్రం మొహం చాటేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

జి.సిగడాం: మండలంలోని నర్సింహపురం – జి.సిగడాం గ్రామాల మధ్యలో ట్రాక్‌పై సోమవారం రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తి గాయాలు పాలయ్యాడు. జారిపడిన వ్యక్తిని ట్రాక్‌మెన్ చూసి 108 వాహనానికి సమాచారం అందించారు. అంబులెన్స్ వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో సుమారు 3 కి.మీ గాయపడిన వ్యక్తిని మోసుకెళ్లారు. అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రాలే వేరు.. ▶ మేమంతా ఒకటే..!

- కలిసిమెలిసి ఉంటున్న రట్టిణి గ్రామస్తులు
- ఒకే ఊరులో రెండు రాష్ట్రాల ప్రజలు
- ఇరు సాంప్రదాయాలకు పెద్దపీట
- కార్తీకంలో ఒకే గుడిలో పూజలు

రట్టిణి గ్రామం.. మెళియాపుట్టి మండలంలోని ఒడిశా సరిహద్దుల్లో ఉంది. అయితే సరిహద్దులో ఉండడం ఒక వింతా? అని అనుకుంటే పొరపాటే. ఈ గ్రామంలో ఒక్కవీధిలోనే పక్క పక్క ఇళ్లల్లో (రట్టిణి ఆంధ్ర గ్రామం, అమర ఒడిశా గ్రామం) ఇరు రాష్ట్రాల ప్రజలు నివాసముంటారు. ఇరువురి సాంప్రదాయాలు పాటిస్తారు. ఆంధ్ర ప్రజలు సైతం ఒరియా భాష మాట్లాడుతూ, దేవాలయాల్లో ఒడిశా సాంప్రదాయాలను పాటిస్తూ పూజలు చేస్తుంటారు. వారికి ఇరురాష్ట్రాల సాంప్రదాయాలతో పాటు, పద్ధతులూ పరిచయమే. పండుగల్లో అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఎవరైనా మీవి రెండు రాష్ట్రాల సాంప్రదాయాలా అని ప్రశ్నిస్తే అదివారికి గుర్తే లేదని చెబుతారు. – మెళియాపుట్టి



ఎడమ వైపు ఒడిశా.. కుడి వైపు ఆంధ్రా ఇళ్లు

ఎన్నికలొస్తే సందడే..



మండల కేంద్రానికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో మహేంద్రతనయ నది ఒడ్డున రట్టిణి గ్రామం ఉంది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా వారికి సందడే. ప్రచారాల్లో ఇరురాష్ట్రాల ప్రజలు పాల్గొనడం వారి స్నేహానికి ప్రతీక. ఇదిలా ఉండగా గ్రామంలో ఉన్న రైతులకు 50 శాతం భూములన్నీ ఒడిశాలోనే ఉన్నాయి. పక్కనే ఉన్న అమర గ్రామానికి (ఒడిశా) చెందినవారి భూములు ఆంధ్రాలో ఉన్నాయి.



200 ఏళ్ల పురాతన ఆలయం

పూజల్లో ప్రత్యేకత

రట్టిణి గ్రామంలో సుమారు 200 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన నీలకంఠేశ్వర ఆలయంలో ఇరురాష్ట్రాల ప్రజలు కలిసి పూజలు చేస్తారు. కార్తీక మాసంలో ఆంధ్రా ప్రజలు నాలుగు సోమవారాలు పూజలు చేస్తారు. ఒడిశా వాసులు మూడు వారాలే చేస్తారు. ఆంధ్రా ప్రజలు గురువారం లక్ష్మీదేవిని పూజిస్తే, ఒడిశా వాసులు శుక్రవారం పూజిస్తారు. ఒకే వీధిలో రెండు రోజులు ఒకే పూజ నిర్వహిస్తారు. ఒడిశా మహిళలు గౌరీ పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు నెల రోజులు కార్తీకమాసంగా భావించి శివుడిని పూజిస్తారు. ఆంధ్రావాళ్లు దీపావళి అమావాస్య నుంచి కార్తీక అమావాస్య వరకు పూజలు నిర్వహిస్తారు. ఆంధ్రా వాళ్ల సహకారంతో ఒడిశా వాళ్లు ఆరాధించే రాధాకృష్ణ ఆలయాన్ని రూ.లక్ష వ్యయంతో నిర్మించారు. ఆంధ్రా వాళ్లు చెడు రోజులుగా భావించిన రోజుల్లో ఒడిశా వాసులు శుభకార్యాలు చేస్తారు. ఇటువంటి విభిన్న ఆధ్యాత్మిక సంస్కృతి ఒకేవీధిలో కనిపించడం కొత్తవాళ్లకు విచిత్రంగా అనిపిస్తుంది.

ఒరియా బోధన

రట్టిణి గ్రామంలో ఉన్న పాఠశాలలో కూడా ఒడిశా వాళ్లు చదువుతూ ఉండడం, అక్కడి బ్రాహ్మణ, ధొలై వీధులకు చెందిన ఆంధ్రా పిల్లలు కూడా ఒరియా భాషపై ఆసక్తి చూపడంతో, ఒరియా భాషకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒరియా ఉపాధ్యాయులను సైతం నియమించింది. దీంతో తెలుగు, ఒరియా ఒకే పాఠశాలలో బోధిస్తున్నారు. ఏదిఏమైనా రట్టిణి గ్రామ ప్రజలు ఇరు రాష్ట్రాల సాంప్రదాయాలు, స్నేహ భావానికి ప్రత్యేక నిదర్శనంగా నిలుస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా సాంప్రదాయాలను ఇరు రాష్ట్రాల ప్రజలు పరస్పరం గౌరవించుకుని కలిసిమెలిసి ఉంటారు. అంతేకాకుండా పక్క పక్క ఇళ్లల్లోనే పెళ్లి సంబంధాలు చేసుకుని పక్కింటి ఆంధ్రా అమ్మాయి.. ఎదురింటి ఒడిశా రాష్ట్రంలోని అత్తింటిలో ఉంటుంది. వీరి బంధువులు సైతం ఆశ్చర్యం పడిన సంఘటనలు ఉన్నాయి.

కలిసిమెలిసి ఉన్నాం

మావి రెండు రాష్ట్రాలన్న మాటే మాకు గుర్తురాదు. గ్రామానికి వచ్చిన వాళ్లు గుర్తుచేస్తే వింతగా అనిపిస్తుంది. కలిసే అన్నీ సాంప్రదాయాలు పాటిస్తాం. ఒకేవీధిలో రెండు రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్నామన్న గుర్తింపు బాగా వచ్చింది. పేరుకే రెండు రాష్ట్రాలు. మా అందరిదీ ఒకే వీధి. మా పిల్లలు ఆంధ్రాలో ఒరియా చదివేవిధంగా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం సంతోషం. రాష్ట్రం వేరైనా పక్కనే పాఠశాల ఉంది.
– రామ్‌నాథ్ పాడి, రట్టిణి గ్రామం

అందరి ఆలోచన ఒకటే



రెండు రాష్ట్రాల సాంప్రదాయాల్లో భాగంగా నిత్యం పూజలు నిర్వహిస్తూనే ఉంటాం. ఆధ్యాత్మిక సాంప్రదాయాల్లో ఇరురాష్ట్రాల ప్రజలు పద్ధతులను పాటిస్తారు. కలిసిమెలిసి ఆలయ అభివృద్ధికి సహకారాన్ని అందిస్తుంటారు. దైవ కార్యక్రమాలు గ్రామంలో విరివిగా జరుగుతాయి.
– శంకర్ పండా, నీలకంఠేశ్వర స్వామి ఆలయ పూజారి

రెండు భాషలు మాట్లాడుకుంటాం



ఆంధ్రాలో ఒడిశాకు చెందిన పిల్లలు చదవడానికి అవకాశం కల్పించడంతో ఒడిశా పిల్లల తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉన్నారు. రెండు రాష్ట్రాల భాషలు మాట్లాడుకుంటాం.. చదువుల్లో కూడా అదే పద్ధతి పాటిస్తాం. ఎటువంటి విభేదాలు లేకుండా మేమంతా సంతోషంగా ఉన్నాం.
– రఘునాథ్ మహాపాత్రో, రట్టిణి గ్రామం

ప్రమాదవశాత్తు యువకుడు మృతి



వెంకటరమణ మృతదేహం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పెద్ద కొల్లివలస పునరావాస కాలనీ వద్ద ఉన్న శ్రీదమయంతి రైస్‌మిల్లు పైకప్పు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి హిరమండలం మండల కేంద్రానికి చెందిన సాహుకారి వెంకటరమణ (28) అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి ఎల్.ఎన్.పేట మండలం చింతలబడవంజ గ్రామానికి చెందిన కురిటి నాయుడు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్ద కొల్లివలస వద్దనున్న శ్రీదమయంతి రైస్ మిల్లుకు సోలార్ సిస్టం ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు అవసరయ్యే కొలతలు తీసుకునేందుకు, హిరమండలానికి చెందిన సోలార్ టెక్నీషియన్లు ముగ్గురు వచ్చారు. వీరు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసేందుకు గానూ రైస్‌మిల్లు గిడ్డంగి పైకప్పు (సిమ్మెంటు రేకులు) మీదకు ఎక్కి కొలతలు వేస్తున్నారు. ఈ సమయంలో వీరు నిల్చున్న రేకు విరిగిపోయింది. దీంతో ఆదే రేకుపై ఉన్న సాహుకారి వెంకటరమణ కిందకు జారిపడిపోయాడు. ఆయనతో పాటు పక్కనే ఉన్న కురిటి నాయుడు కూడా జారిపడిపోయాడు. జారిపడిపోయిన ఇద్దరులో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. కురిటి నాయుడుకి గాయాలయ్యాయి. దీంతో అతడిని మిల్లు కళాసీలు ఆటోలో హిరమండలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నడుము వెన్నెముక విరిగిపోయిందని గుర్తించిన డాక్టర్లు నాయుడుని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సింహాచలం మృతదేహం

కొత్తూరు: మండలంలోని వసప కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నివగాంకు చెందిన నూలు సింహాచలం(51) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు సింహాచలం నివగాం నుంచి కొత్తూరుకు బైక్ మీద వస్తున్నాడు. అదే సమయంలో నివగాం నుంచి కొత్తూరు వైపు వస్తున్న ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా దొంగల కొత్తూరుకు చెందిన మాల్లా నారాయణ వెనుక నుంచి బైక్‌వచ్చి సింహాచలంను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సింహాచలంకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతడి మృతితో గ్రామంలో విషాదం అలముకుంది. మృతుడికి భార్య పద్మ, అఖిల్, నిఖిల్ ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీడీఏ పీవోకు వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి తదితరులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం సమావేశ మందిరంలో సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి అధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టెక్కలి డివిజన్ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజనులు అనేక వినతులు అందించారు. గిరిజన గ్రామాలకు రహదారులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాల గురించి, ఇళ్ల మంజూరు, వ్యవసాయ పనిముట్లు అందజేయమని కోరారు. అదేవిధంగా పలు గ్రామాలకు పాఠశాల భవనాలు నిర్మించాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయడంతో పాటు, స్థానిక పీహెచ్‌సీని సీహెచ్‌సీగా చేయాలని, మండల కేంద్రంలో పాలి టెక్నికల్ కళాశాల నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపీపీ మాడుగుల రామారావు తదితరులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, ఈఈ రమాదేవి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఈలు రవి, శ్రీనివాసరావు, ఏఎంవో కోటిబాబు, మండల ప్రత్యేక అధికారి లింగాల మధుబాబు, ఎంపీడీవో నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 65 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు అర్జీదారుల నుంచి 65 ఫిర్యాదులు వచ్చాయి. దీనిలో భాగంగా పాత టెక్కలికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు అవగాన దానయ్య తనపై అదే గ్రామ టీడీపీ వర్గీయులు దాడి చేసినా, పోలీసులు పట్టించుకోలేదని ఫిర్యాదు చేశాడు. పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల తాలుకా కుర్చీని సచివాలయం నుంచి చెత్తబండిలో టీడీపీ వాళ్లు ఇంటికి పంపారని, ఈ విషయంపై సచివాలయం ముందు తాము ధర్నా చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదు చేశారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐకు, గత వారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. సర్పంచ్‌కి ఇచ్చే గౌరవమిదేనా అని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరంతా మాజీ మంత్రి సీదిరి వెంట వచ్చి ఎస్పీకి ఫిర్యాదు చేయడం గమనార్హం.

వృద్ధుడు అదృశ్యం



సింహాచలం

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామానికి చెందిన సడగాన సింహాచలం అనే వృద్ధుడు గత మూడు రోజుల నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు శ్రీనివాసరావు సారవకోట పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 2వ తేదీన ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి, ఇప్పటివరకు ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాన్ఫిడెన్షియల్ డీన్‌గా లోకేశ్వరి



లోకేశ్వరికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ కాన్ఫిడెన్షియల్ డీన్‌గా డాక్టర్ ఎన్.లోకేశ్వరిని నియమిస్తూ రిజిస్ట్రార్ పి.సుజాత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల ప్రతిని వీసీ కె.ఆర్.రజిని అందజేశారు. దీంతో పాటు మరికొన్ని నియామకాలు చేపట్టారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.రామకృష్ణను వర్సిటీ వెబ్‌సైట్ కో–ఆర్డినేటర్‌గా, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.ప్రకాష్‌బాబును స్వర్ణాంధ్ర–2047 కో–ఆర్డినేటర్‌గా, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సుష్మారెడ్డిని మూక్స్ (మాసీవ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్) సమన్వయకర్తగా, ఇంజినీరింగ్ ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.గణేష్‌బాబును స్వయం (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పిరింగ్ మైండ్స్) కో–ఆర్డినేటర్‌గా నియమించారు.

సమస్యలు వేగవంతంగా పరిష్కరించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీ కోసంకు 204 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీ కోసం(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి, ప్రజల నుంచి 204 అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలం స్థాయిలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు మండల స్థాయి కమిటీ సభ్యులు పాల్గొని సంబంధిత సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజు, ఉప కలెక్టర్ అప్పారావు, డీపీవో కె.భారతీసౌజన్య, జిల్లా వైద్యారోగ్య అధికారి డా.బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ, డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు, డీసీహెచ్ఎస్ డా.కల్యాణబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే నవంబర్ 18న సీసీఎల్‌ఏ ఆఫీస్ వద్ద పోరాటం తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు వీఆర్‌ఏలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, ఇసుక వద్ద నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. తెలంగాణాలో అమలవుతున్న విధంగా పే స్కేల్ జీతాలు చెల్లించాలన్నారు. గతంలో తమ జీతాన్ని రూ.15,000లకు పెంచుతామని చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన విధానాన్ని విడనాడి సత్వరమే పరిష్కరించాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు ఎస్.సీతప్పడు, డి.అప్పారావు, కె.పురుషోత్తం, బి.రాములమ్మ, సన్యాసమ్మ, మీనాక్షి, రఘు, రాజారావు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్ల గుడిసెలపై ▶ పంజా

- అరకభద్రలో షాడో సర్పంచ్ అరాచకం
- రోడ్డు పేరుతో గుడిసెలు కూలదోసేందుకు యత్నం
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులనే అక్కసుతోనే...



కూల్చేసిన రాజేంద్ర బెహరా గుడిసె



కుమ్మరి వీధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: రెక్కాడితే గానీ.. డొక్కాడని బతుకులు వారివి. మట్టి కుండలు చేస్తే గానీ.. పొయ్యి మీద బియ్యం ఉడకని పరిస్థితి వారిది. అయితే తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న వారి గుడిసెలపై షాడో సర్పంచ్ కన్ను పడింది. రోడ్డు విస్తీర్ణం పేరుతో పథకం ప్రకారం వాటిని జేసీబీతో కూలదోస్తుండగా కడుపు మండిన కుమ్మరులు అడ్డుకున్నారు. అయినప్పటికీ షాడో సర్పంచ్ అధికారం ముందు వారి ఆవేదన, ఆక్రందనలు అరణ్య రోదనగా మిగిలాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇచ్ఛాపురం మండలం అరకభద్ర గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా కుమ్మరి ఎగువ వీధిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేసేందుకు సర్పంచ్ రంగాల పద్మావతి కుమారుడు ధర్మారావు పూనుకున్నాడు. సుమారు నలభై కుటుంబాలు ఆ కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్నాయి. ఆ కుటుంబాలకు సంబంధించి ఇళ్లకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాల్లో తరాల నుంచి గుడెసెలు నిర్మించుకొని అందులో వారు తయారు చేసిన మట్టి కుండలు, మట్టి పాత్రలు భద్రపరుచుకుంటూ వస్తున్నారు. అదనంగా నిర్మించబోయే సీసీ రోడ్డుకు గుడెసెలు అడ్డుగా ఉన్నాయంటూ ఆదివారం సదరు సర్పంచ్ కుమారుడు ప్రొక్లెయినర్‌తో వాటిని కూలదోసేందుకు ప్రయత్నించాడు. దీనిలో భాగంగా రాజేంద్ర బెహరాకు చెందిన గుడెసెను కూలదోశారు.

అడ్డుకున్నవారిపై దాడి

గుడెసెలు కూలదోయడంతో తమ సొంత ఆస్తులను ఎలా కూల్చివేస్తారని అడ్డుకున్న యువకుడు రాజేంద్రపై టీడీపీ నాయకులు చేయి చేసుకున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. తమ ఇంటి ముందుకు ఉన్న గుడెసెలను తొలగించాలంటూ అధికారులు కనీసం చెప్పలేదని వాపోయారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సపోర్ట్ చేశామన్న అక్కసుతోనే రోడ్డు వెడల్పు పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని కుమ్మరి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 8 అడుగుల సీసీ రోడ్డు ఉందని, ఆ రోడ్డుకు ఆనుకొని విద్యుత్ స్తంభాలు, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు ఉన్నప్పటికీ కావాలనే సీసీ రోడ్డు వేస్తున్నారని, ఇప్పటికైనా ఈ పనులు నిలిపివేసి తమ భూములు, గుడిసెలను కాపాడాలని కోరుతున్నారు. దీనిపై సర్పంచ్ కుమారుడు ధర్మారావు మాట్లాడుతూ గ్రామసభలో తమ సీసీ రోడ్డును వెడల్పు చేయాలంటూ ఆ వీధికి చెందిన కొంతమంది గ్రామసభలో కోరడంతో, ఈ రోడ్డును వేసేందుకు పూనుకున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ఎంపీడీవో, పంచాయతీ రాజ్ శాఖ జేఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఉపాధి ఏపీవో, పంచాయతీ కార్యదర్శుల వివరణ కోరాగా సీసీ రోడ్డు విస్తీర్ణం పనులకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదని స్పష్టం చేశారు.